సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం। 11। ఏప్రిల్। 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి. మార్కెట్‌కు 504 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.




బండ బాదుడు.. చిల్లర దోపిడీ!

గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు అడ్డగోలు దోపిడీకి తెరలేపారు. గ్యాస్ సిలిండర్ల డోర్ డెలివరీకి కొన్నిచోట్ల ఏకంగా రూ.150 డిమాండ్ చేస్తున్నారు.

8లో

గరిష్టం/కనిష్టం
40.5°/27.3°

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.



న్యూస్‌రీల్

17న అనంతకు సీఎం జగన్



అనంతపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 17వ తేదీన అనంతపురం జిల్లా నార్పలకు రానున్నారు. 'జగనన్న వసతి దీవెన' పథకం నగదు జమ కార్యక్రమాన్ని బహిరంగ సభా వేదిక నుంచే సీఎం బటన్ నొక్కి ప్రారంభించనున్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు.

కానిస్టేబుల్‌కు దేహశుద్ధి



కానిస్టేబుల్‌పై దాడి చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: కానిస్టేబుల్‌కు భార్య బంధువులు దేహశుద్ధి చేశారు. హిందూపురం ప్రాంతంలో పనిచేసే కానిస్టేబుల్ సోమందేపల్లికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో భార్య, పిల్లలను నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నాడు. సోమవారం ఆమెతో మాట్లాడటానికి కానిస్టేబుల్ సోమందేపల్లికి రాగా, అప్పటికే నిఘా వేసి ఉన్న భార్య బంధువులు అతనిపై పిడిగుద్దుల వర్షం కురిపించారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. స్థానికులు జోక్యం చేసుకుని ఇరు పక్షాల వారికీ నచ్చజెప్పారు. అనంతరం తన భర్తతో వివాహేతర సంబంధం కల్గి ఉన్న ఆ మహిళకు చెందిన ఫ్యాన్సీ స్టోర్ వద్దకు కానిస్టేబుల్ భార్య చేరుకోగా.. సదరు మహిళ అప్పటికే అక్కడి నుంచి పరారైంది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు కానిస్టేబుల్ భార్య బంధువులు తెలిపారు.

వెబ్‌సైట్‌లో డీఎస్సీ-98 మెరిట్ జాబితా

రాప్తాడురూరల్: డీఎస్సీ-98లో అర్హత సాధించిన అభ్యర్థుల మెరిట్ జాబితాను కలెక్టర్ ఆమోదంతో సోమవారం విడుదల చేశారు. కాంట్రాక్ట్ పద్ధతిలో మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) కింద ఎస్జీటీలుగా పని చేసేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 572 మంది అభ్యర్థులు అంగీకారం తెలిపారు. వీరిలో ఈ ఏడాది మార్చి 15 నాటికి 60 ఏళ్లు నిండిన వారిని అనర్హులుగా గుర్తించారు. తక్కిన 536 మంది అభ్యర్థులను కౌన్సెలింగ్ నియమించనున్నారు. మెరిట్ జాబితాను https://deoananthapuramu.blogspot.comలో ఉంచారు. ఈ నెల 12, 13 తేదీల్లో అనంతపురం శారదానగర్‌లోని సైన్స్ సెంటర్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ ఎం.సాయిరామ్ తెలిపారు. వరుస నంబరు 1 నుంచి 280 వరకు 12వ తేదీ, 281 నుంచి 536 వరకు 13వ తేదీ కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. అభ్యర్థులు హాల్‌టికెట్, ఇంటర్వ్యూ లెటర్, ఒరిజనల్ విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డ్, 3 ఫొటోలు, సర్టిఫికెట్లు ఒక జత జిరాక్స్ కాపీలను గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి తీసుకురావాలని సూచించారు.

అమ్మో ఎండ



భానుడు భగభగ మండిపోతున్నాడు. ఉదయం 9 గంటల నుంచే ప్రతాపం చూపుతున్నాడు. మధ్యాహ్నం వేళ సెగలు కక్కుతుండగా, జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 10 తర్వాత ఇంట్లోంచి కాలు బయటపెట్టేందుకు జంకుతున్నారు. దీంతో జిల్లాలోని ప్రధాన పట్టణాల్లోని రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు ఏప్రిల్‌లోనే 40 డిగ్రీల మార్క్ దాటుతుండగా, మే నెలను తలచుకుని జనం భయపడిపోతున్నారు.

నిప్పులు కురిపిస్తున్న భానుడు

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రత
- జిల్లాలో 40 డిగ్రీలకు చేరిన గరిష్ట ఉష్ణోగ్రత
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



జన సంచారం లేక నిర్మానుష్యంగా మారిన కదిరి వేమారెడ్డి కూడలి

కదిరి: రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం అల్లాడిపోతున్నారు. జిల్లాలోని హిందూపురం, కదిరి, పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో సోమవారం 38 నుంచి 40 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో మధ్యాహ్న సమయంలో రోడ్డుపైకి రావడానికే జనం భయపడుతున్నారు. ఉపాధి కూలీలు కూడా ఉదయాన్నే పనులకు వెళ్లి 10 గంటలకు ఇంటికి చేరుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

శీతల పానీయాలకు పెరిగిన డిమాండ్..

ఎండవేడిమి నుంచి కాస్త ఉపశమనం పొందేందుకు జనం శీతల పానీయాలను సేవించేందుకు ఇష్టపడుతున్నారు. దీంతో కూల్ డ్రింక్ షాపులు జనంతో కిటకిట లాడుతున్నాయి. డిమాండ్ పెరిగే కొద్దీ ధరలు కూడా ఎండల్లానే మండిపోతున్నాయి. రోడ్డు పక్కన కొబ్బరి బోండాలకు గిరాకీ పెరగడంతో ఒక్కోటి రూ.35 నుంచి రూ.40 వరకూ విక్రయిస్తున్నారు. చెరువు పాల ధర కూడా గతంతో పోలిస్తే పెరిగింది. అలాగే హైస్పీడ్ ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఏసీలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ప్రతి ఇంట్లోనూ విద్యుత్ వినియోగం కూడా బాగా పెరిగింది.

నిర్మానుష్యంగా రహదారులు..

భానుడి భగభగలతో జనం ఇంట్లోంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. చాలామంది ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ ఇంట్లోనే గడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్లపైకి వస్తున్న వారు గొడుగులు వెంట తెచ్చుకుంటున్నారు. అలాగే టోపీలు, కళ్లద్దాలు ధరిస్తున్నారు. మహిళలైతే మొహంతో పాటు తల మొత్తాన్ని హిజాబ్ తరహాలో కప్పుకుని వెళ్తున్నారు. పెరిగిన ఉష్ణోగ్రతలతో పరిశ్రమలు, పలు కార్యాలయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది మధ్యాహ్న భోజనం కోసం ఇంటికి వెళ్లడానికి ఇష్టపడటం లేదు. దీంతో జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో మధ్యాహ్న సమయంలో రహదారులు నిర్మానుష్యంగా కన్పిస్తున్నాయి.

ఈ నెల 1 నుంచి జిల్లాలో ఉష్ణోగ్రతల నమోదు ఇలా..

తేదీ	కనిష్టం	గరిష్టం
01-04-23	26.1	34.2
02-04-23	28.2	34.7
03-04-23	25.4	35.4
04-04-23	25.7	37.6
05-04-23	24.2	36.2
06-04-23	26.3	37.6
07-04-23	24.2	37.2
08-04-23	27.2	37.6
09-04-23	27.6	38.3
10-04-23	27.3	40.5

ఎంతో అవసరమైతేనే బయటకు రండి



అనవసరంగా ఎండల్లో తిరిగి కష్టాలు తెచ్చుకోవద్దు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఎండలో తిరగకూడదు. వీరికి వడదెబ్బ తగిలే ప్రమాదం ఎక్కువ. తప్పని సరై బయటకు వెళ్లాల్సి వస్తే తప్పకుండా వెంట గొడుగు తీసుకెళ్లండి. కనీసం కళ్లకు అద్దాలు, తలకు టోపీ ఉండేలా చూసుకోండి. ఎండాకాలంలో ఎక్కువగా మంచినీళ్లు తాగడం అలవాటు చేసుకోండి. వడదెబ్బకు గురైతే సొంత వైద్యం పక్కన బెట్టి... వెంటనే 108కు ఫోన్ చేసి ప్రభుత్వాస్పత్రికి చేరుకోవడం క్షేమదాయకం.

– డా.మదన్ కుమార్, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు, కదిరి

ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం



ఈ నెలలో పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 41 డిగ్రీలకు చేరుకునే అవకాశం ఉంది. మే మాసంలో 42, 44 డిగ్రీల మార్క్ దాటవచ్చు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎండల తీవ్రత కాస్త ఎక్కువే. రైతులు, రైతు కూలీలు, చిరు వ్యాపారులు వీలైనంత వరకూ రోజంతా ఎండలో లేకుండా జాగ్రత్తలు తీసుకోండి.

– డా.సంపత్‌కుమార్, వాతావరణ నిపుణులు, కదిరి

'పది' గణితం పరీక్షకు 298 మంది గైర్హాజరు



గోరంట్లలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్/ గోరంట్ల: పదో తరగతి పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరుగుతున్నాయి. సోమవారం 125 పరీక్ష కేంద్రాల్లో గణితం పరీక్ష నిర్వహించారు. 24,616 మందిగాను 24,318 మంది హాజరయ్యారు. వివిధ కారణాలతో 298 మంది గైర్హాజరయ్యారు. గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని ఉదయ్‌కిరణ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, గోరంట్లలోని బాలుర, బాలికల పాఠశాలల్లోని కేంద్రాలు, ఉర్దూ ఉన్నత పాఠశాల, వివేకానంద ఇంగ్లిష్ మీడియం పాఠశాలలోని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ బసంత్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. ముఖ్యంగా గాలి వెలుతురు సరిగా ఉండేలా చూడడంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారును ఆదేశించారు.

కిలో టమాట రూ.10



అనంతపురం అగ్రికల్చర్: నగర శివారులోని కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట రూ.10 ప్రకారం పలికినట్లు ఏడీఎం పి.సత్యనారాయణచౌదరి, రాప్తాడు సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 30 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయన్నారు. కిలో గరిష్ట ధర రూ.10, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.5.50 ప్రకారం అమ్మకాలు జరిగాయని వెల్లడించారు.

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కలెక్టర్ పి.అరుణ్‌బాబు

- నూతన కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- సోమవారం సాయంత్రం బాధ్యతల స్వీకరణ
- అభినందనలు తెలిపిన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు

పుట్టపర్తి అర్బన్: అధికారుల సమన్వయంతో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జిల్లా నూతన కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. సోమవారం సాయంత్రం 5.22 గంటలకు జిల్లా నూతన కలెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడారు. మొదటి నుంచీ కష్టపడి పని చేయడం తనకు అలవాటన్నారు. తాను మొదటి సారి రాయలసీమ జిల్లాలకు వచ్చానని, ఈ ప్రాంతం కొత్త అయినప్పటికీ సాధ్యమైనంత త్వరగా అవగాహన పెంచుకుని ప్రభుత్వ లక్ష్యాల మేరకు పనిచేస్తానన్నారు. ముఖ్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని పని చేస్తానన్నారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు ప్రశాంతి నిలయంలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ..

జిల్లా రెండో కలెక్టర్‌గా పి.అరుణ్‌బాబు సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం చేశారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీపీఓ విజయ్‌కుమార్, ఆర్డీఓలు రాఘవేంద్ర, తిప్పేనాయక్, ఏఎస్పీ రామకృష్ణప్రసాద్, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ విజయ్‌కుమార్‌రెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగప్రసాద్, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, డీఈఓ మీనాక్షి, బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మల జ్యోతి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, చేనేత జౌళి శాఖ ఏడీ రమేష్, పట్టు పరిశ్రమల శాఖ జేడీ పద్మమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్‌ఖాన్, వివిధ శాఖల జిల్లా అధికారులు కలెక్టర్‌కు శుభాకంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.







కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు శుభాకాంక్షలు చెబుతున్న హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్

అందరికీ ధన్యవాదాలు.. వెళ్లొస్తా



జిల్లా అధికారులకు నమస్కరిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

- జిల్లా అధికారులకు కృతజ్ఞతలు చెప్పిన కలెక్టర్ బసంత్ కుమార్

పుట్టపర్తి అర్బన్: 'సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు...ఇక వెళ్లొస్తా' అంటూ కలెక్టర్ బసంత్‌కుమార్ జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ బసంత్‌కుమార్‌ను ఏపీ స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం అన్ని శాఖల జిల్లా అధికారులతో మాట్లాడారు. నూతన జిల్లాగా ఆవిర్భవించిన శ్రీసత్యసాయికి తొలి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం తన అదృష్టంగా భావించానన్నారు. తాను విధుల్లో చేరిన నాటి నుంచి వెన్నంటి నడిచి తన ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ జిల్లా అభివృద్ధికి అందరూ సహకరించారన్నారు. ఈ జిల్లా ఉద్యోగులందరికీ తన మనసులో ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. ఉద్యోగి జీవితంలో బదిలీలు సహజమని, పుట్టపర్తిలో పని చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఏరోజు పని ఆరోజే పూర్తి చేస్తే ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఉంటుందని, దీన్ని గుర్తించుకుని అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా అధికారులంతా కలెక్టర్ వరుస క్రమంలో నిల్చొని ఘన వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ రామాంజనేయులు, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి సుభదాస్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డీఏఓ సుబ్బారావు, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, ఏపీఎంఐపీ సుదర్శన్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిష్కారం సంతృప్తికరంగా ఉండాలి

- స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించండి
- అధికారులతో కలెక్టర్ బసంత్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: ఎన్నో సమస్యలతో జిల్లా కార్యాలయాలకు వచ్చే అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై మొత్తం 141 అర్జీలు అందగా, కలెక్టర్ బసంత్‌కుమార్ అర్జీలతో ఓపికతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొన్ని సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడే చర్యలు తీసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ, అర్జీలన్నీ గడువు లోపే పరిష్కరించాలన్నారు. పరిష్కరించలేని వాటి గురించి అర్జీ దారునికి తెలిపాలన్నారు. అలా చేయకపోతే అర్జీలు పునరావృతమయ్యే అవకాశం ఉందన్నారు. చాలా సమస్యలకు మండల కేంద్రాల్లోనే పరిష్కారం ఉంటుందనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది సక్రమంగా పని చేస్తే అర్జీల సంఖ్య తగ్గముఖం పడుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందనలో వచ్చిన అర్జీలు కొన్ని...

- కదిరి మండలం కాళసముద్రం గ్రామ పొలంలోని సర్వే నంబర్ 477లోని 3.97 ఎకరాలపైకి 49 సెంట్ల తన భూమికి చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి మండలం కాండ్లమడుగు గ్రామానికి చెందిన భూలక్ష్మిదేవి అక్రమంగా పట్టాదార్ పాస్ పుస్తకం చేయించుకున్నారని కాళసముద్రం గ్రామానికి చెందిన గవ్వడుచెరువు గంగప్ప మనుమరాలు కోనమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.
- ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లి సర్వే నంబర్ 110-3లో 4.82 ఎకరాల భూమిని తాను ఏళ్లుగా సాగు చేసుకుంటున్నానని, నారాయణస్వామి అనే వ్యక్తి 1.70 ఎకరాల భూమిని ఆక్రమించాడని, ప్రశ్నిస్తే బెదిస్తున్నాడని వెంకటరాముడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తనకు తగిన న్యాయం చేయాలని కోరారు.
- ముదిగుబ్బ మండలం చిన్నకోట్ల గ్రామానికి చెందిన సీబీఆర్ నిర్వాసితుల కోసం ముదిగుబ్బ మండలంలోని గుంజేపల్లికి చెందిన సర్వే నంబర్లు 1031-2ఏ, 1164-3ఏ లో 6.63 ఎకరాలు భూమిని ప్రభుత్వ కేటాయించినా, ప్లాట్లు చూపకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని చిన్నకోట్లకు చెందిన నారాయణస్వామితో పాటు మరి కొంత మంది కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. త్వరగా స్థలాలు కేటాయిస్తే తాము ఇళ్లు నిర్మించుకుంటామన్నారు.

పాలబావికి పడతుల హారతి

- గంగపూజకు పోటెత్తిన మహిళలు
- తెల్లవారుజాము నుంచే మహాలక్ష్మి అమ్మవారికి పూజలు



పాలబావిలో గంగ పూజలో నిమగ్నమైన మహిళలు

రొళ్ల: రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహిళలు పాలబావిలో గంగ పూజలు చేశారు. అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఉత్సవ విగ్రహానికి సుప్రభాత సేవలు మొదలుకొని విశేష పూజలు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారికి పూజలు చేశారు.

మొక్కులు చెల్లించుకున్న మహిళలు..

సోమవారం ఉదయాన్నే వందలాది మంది మహిళలు చన్నీటి స్నానం ఆచరించి మడికట్టుకుని అమ్మవారి ఆలయం సమీపాన ఉన్న పాలబావి వద్ద గంగ పూజ చేశారు. పాలబావి వద్ద పూజలు చేస్తే వివాహ, సంతాన భాగ్యం కలుగుతుందని, దీర్ఘకాలిక వ్యాధులతో నయమవుతాయని భక్తుల నమ్మకం. దీంతో వందలాది మంది మహిళలు బావిలోకి గాజులు, పండ్లు, పూలు, బేడలు, ఇతరాత్ర వాటిని నైవేద్యంగా సమర్పించారు. హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయానికి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. బావి వద్ద గజ ఈతగాళ్లతో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



విశేష అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు..

రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగియనున్నట్లు దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.



విద్యార్థి దుర్మరణం


గగన్‌తేజరెడ్డి (ఫైల్)

గోరంట్ల: వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గోరంట్ల మండలం రెడ్డిచెరువుపల్లి నివాసి ఆదినారాయణరెడ్డి కుమారుడు గగన్‌తేజరెడ్డి (15) పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పరీక్ష రాసేందుకు ద్విచక్ర వాహనంపై గోరంట్లలోని పరీక్ష కేంద్రానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో పులగూర్లపల్లి వద్ద వేగాన్ని నియంత్రించుకోలేక డివైడర్‌ను ఢీకొనడంతో రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని కుమారుడి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ బాబు తెలిపారు.



బండ బాదుడు.. చిల్లర దోపిడీ!

- జిల్లాలో గ్యాస్ ఏజెన్సీల అడ్డగోలు దోపిడీ
- గ్యాస్ సిలిండర్లపై అదనపు వసూలు
- ఒక్కో సిలిండర్‌పై రూ.150 వరకు అదనంగా డిమాండ్



సాక్షి, పుట్టపర్తి: వంట గ్యాస్ ధరకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఇప్పటికే ఓవైపు పెట్రోల్, డీజిల్ ధరలు, మరోవైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ప్రజల నెత్తిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మళ్లీ భారం మోపింది. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్‌పై గత ఏడాది మార్చిలో రూ.50, జులైలో రూ.50 పెంచిన బీజేపీ ప్రభుత్వం తాజాగా ఒక్కో సిలిండర్‌పై మరో రూ.50 పెంచింది. అంతేకాక వాణిజ్య సిలిండర్ ధరను రూ.350.50పైసలు పెంచింది. ఈ బాదుడుతో వినియోగదారులు ఓ వైపు బెంబేలెత్తి పోతుండగా... స్థానిక గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు చిల్లర దోపిడీకి తెరలేపారు. డెలివరీ బాయ్స్‌ను అడ్డుపెట్టుకుని అందిన కాడికి దోచేస్తున్నారు. గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్‌కు ప్రభుత్వ నిర్ణీత ధర రూ.1,169.50గా ఉండగా డెలివరీ బాయ్స్ ఒక్కో సిలిండర్‌పై అదనంగా రూ.100 నుంచి రూ.150 వరకూ వసూలు చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై దురుసుగా వ్యవహరిస్తున్నారు. కట్టడి చేయాల్సిన పౌర సరఫరాల శాఖ అధికారులు మాత్రం తమకెలాంటి ఫిర్యాదులు అందడం లేదంటూ చోద్యం చూస్తున్నారు.

నిబంధనలు తుంగలోకి..

జిల్లా వ్యాప్తంగా 30 గ్యాస్ ఏజెన్సీలున్నాయి. అనుమతి పొందిన ఏజెన్సీల నిర్వాహకులకు ఒక్కో సిలిండర్ సరఫరా చేసినందుకు రూ.60 నుంచి రూ.70ను కమీషన్ రూపంలో ప్రభుత్వం చెల్లిస్తోంది. నిబంధనల మేరకు ఏజెన్సీ పరిధిలోని ఐదు కిలోమీటర్ల వరకూ ఉచిత డోర్ డెలివరీ చేయాలి. అయితే ఈ నిబంధనలు జిల్లాలో ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. కమీషన్ల రూపంలో ఒక్కో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు నెలకు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ ఆదాయం సమకూరుతోంది. ఇందులో నుంచి సిబ్బందికి, డెలివరీ బాయ్స్‌కు వేతనాలు చెల్లిస్తుంటారు. కొన్ని ఏజెన్సీలు డెలివరీ బాయ్స్‌కు నెలకు రూ.4వేలకు మించి జీతాలు చెల్లించడం లేదు. ఇంకొన్ని ఏజెన్సీలు సిలిండర్‌కు రూ.5 నుంచి రూ.15 వరకూ బాయ్స్‌కు కమీషన్ రూపంలో చెల్లిస్తున్నాయి. వాహన ఇంధన ఖర్చులు కూడా అందులోనే భరించాలనే షరతు విధిస్తున్నారు.

అక్రమాల్లో మచ్చుకు కొన్ని..

- హిందూపురంలోని వీడీ రోడ్డుకు చెందిన గణేష్ బుక్ చేసిన గ్యాస్ సిలిండర్‌ను డెలివరీ బాయ్ ఇంటి వద్దకు తీసుకెళ్లాడు. బిల్లులో పేర్కొన్న మొత్తాన్ని ఇచ్చేందుకు గణేష్ సిద్ధమవుతుండగా రూ.1,250 ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేకపోతే సిలిండర్ ఇచ్చేది లేదంటూ భుజానికెత్తుకున్నాడు. దీంతో చేసేది లేక డెలివరీ బాయ్‌కు రూ.1,250 చెల్లించి సిలిండర్ తీసుకున్నాడు. ఇంటి పక్కనే గోదాము ఉన్న గణేష్ పరిస్థితి ఇది.

జిల్లాలో మొత్తం గృహ వినియోగ వంట గ్యాస్ కనెక్షన్లు	5,16,126
వాణిజ్య వినియోగ వంట గ్యాస్ కనెక్షన్లు	292,363
ఐదు కిలోమీటర్ల లోపు డెలివరీ రుసుం	ఉచితం
ఐదు నుంచి 15 కిలోమీటర్ల వరకు డెలివరీ రుసుం	రూ.20
15 కిలోమీటర్లు దాటితే	రూ.30

- హిందూపురంలోని ముక్కిడిపేటకు చెందిన వరలక్ష్మి తన మొబైల్‌లో గ్యాస్ సిలిండర్ బుక్ చేస్తూ ఆన్‌లైన్ ద్వారానే డబ్బులు కూడా చెల్లించింది. నాలుగు రోజుల తర్వాత గ్యాస్ సిలిండర్ తీసుకుని డెలివరీ బాయ్ వెళ్లాడు. అదనంగా రూ.70 ఇవ్వాలని లేకపోతే సిలిండర్ ఇచ్చేది లేదంటూ భీష్మించాడు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ ఖాళీ కావడంతో చివరకు రూ.50 చెల్లించి సిలిండర్ తీసుకుంది.
- నల్లచెరువుకు చెందిన రమేష్.. ఈ నెల 1న గ్యాస్ సిలిండర్ బుక్ చేశాడు. మూడు రోజుల తర్వాత తనకల్లు నుంచి సిలిండర్ బాయ్ తీసుకెళ్లాడు. నిర్ణీత ధరపై అదనంగా రూ.150 ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అదేంటని అడగ్గా.. నిర్వాహకుడికి రూ.100 కమీషన్ ఇవ్వాలని చెప్పాడు. తెచ్చినందుకు తనకు రూ.50 ఇవ్వాలని వివరించాడు.

పక్కదారి పడుతున్న వంట గ్యాస్..

జిల్లా వ్యాప్తంగా 8,08,489 గ్యాస్ కనెక్షన్లు ఉండగా ఇందులో గృహ వినియోగ కనెక్షన్లు 5,16,126 ఉన్నాయి. ఒక్కో సిలిండర్‌పై సగటున రూ.50 ప్రకారం లెక్కించినా.. సుమారు రూ.4 కోట్ల వరకూ అక్రమ వసూళ్లను ఏజెన్సీ నిర్వాహకులు ప్రోత్సహిస్తున్నట్లుగా తెలుస్తోంది. అదనపు వసూళ్లపై ప్రశ్నించిన వారిపై డెలివరీ బాయ్స్ దురుసుగా వ్యవహరిస్తున్నారు. గ్యాస్ సిలిండర్ ఇవ్వకుండానే వెనుదిరుగుతున్నారు. ఈ క్రమంలో గృహ వినియోగ గ్యాస్ పక్కదారి పడుతోంది. నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య అవసరాలకు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను అప్పగించి అదనపు సొమ్మును దండుకుంటున్నారు. ఈ చీకటి వ్యాపారం హిందూపురంలోనే ఎక్కువగా కొనసాగుతుండడం గమనార్హం. గ్యాస్ ఏజెన్సీలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి చిల్లర దోపిడీని అరికట్టాల్సిన పౌర సరఫరాల శాఖాధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కారణంగానే ఏజెన్సీల వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు



ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే తప్పక చర్యలు తీసుకుంటాం. గ్యాస్ సరఫరాలపై ఎప్పటికప్పుడు ఏజెన్సీల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. అక్రమ వసూళ్లు వాస్తవాలని తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి

ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం


ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు హేమలత

కొత్తచెరువు: అంగన్‌వాడీ కార్యకర్తగా ఉద్యోగం ఇప్పిస్తానంటూ పోలీస్ యూనిఫాంలో వచ్చిన వేణుగోపాల్ అనే వ్యక్తి రూ.80 వేలు అపహరించుకెళ్లాడని గాండ్లపెంట మండలం నీరుకుంట్లపల్లికి చెందిన ఎం.హేమలత వాపోయింది. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్‌ను కలసి అర్జీ అందజేసి, మోసపోయిన తీరును వివరించింది. రూ.80 వేలు తీసుకున్న వేణుగోపాల్ ఇప్పటి వరకూ తనకు ఉద్యోగం ఇప్పించలేదని, డబ్బు వెనక్కు ఇవ్వమని కోరితే దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని కన్నీటి పర్యంతమైంది. ఈ విషయమై అమడగూరు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయాలని వేడుకుంది. కాగా, వివిధ సమస్యలపై 53 వినతులు స్పందన కార్యక్రమానికి అందినట్లు జిల్లా పోలీసు కార్యాలయం వెల్లడించింది. అర్జీలను ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ స్వయంగా స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా భూసార పరీక్షలు


మట్టి పరీక్షల నిర్వహణపై శిక్షణ ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల పొలాల్లో భూసార పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి బి.చంద్రానాయక్ తెలిపారు. ఈ మేరకు రైతుల పొలాల్లో మట్టిని సేకరించి ప్రయోగశాలలో భూసార పరీక్షలు పక్కాగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. భూసార పరీక్షల నిర్వహణపై శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని నియోజకవర్గ స్థాయి అగ్రికల్చర్ ల్యాబ్ ఏఓలు, సిబ్బందికి అనంతపురంలోని భూసార పరీక్షా కేంద్రం (సాయిల్ టెస్టింగ్ ల్యాబోరేటరీ–ఎస్‌టీఎల్)లో ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో సోమవారం ప్రారంభమైంది. ఏడీఏ ఎల్.రోజాపుష్పలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చంద్రానాయక్ హాజరై, మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ పంటల సాగు యాజమాన్యంలో మట్టి పరీక్షలకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటిస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులు గణనీయంగా తగ్గుతాయన్నారు. తద్వారా వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. ఎంపిక చేసిన పొలాల్లో. సేకరించిన మట్టిలో పీహెచ్, ఈసీ, ఓసీ, ఎన్–పీ–కే, సల్ఫర్, జింక్, బోరాన్, మెగ్నీషియం, ఐరన్, మాంగనీసు లాంటి పోషకాలను విశ్లేషించడంపై టెక్నికల్ ఏఓలు ఆదిలక్ష్మి, రుమానాబేగం అవగాహన కల్పిస్తారన్నారు. శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.

బొలెరోను ఢీకొన్న కంటైనర్

- మహిళ దుర్మరణం
- ఏడుగురికి తీవ్ర గాయాలు


మృతురాలు వెంకటలక్ష్మమ్మ

తనకల్లు: బొలెరోను కంటైనర్ ఢీకొన్న ఘటనలో ఓ మహిళ దుర్మరణం చెందింది. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని చిక్కబళ్లాపురం జిల్లా చిన్నసంద్ర గ్రామానికి చెందిన వెంకటలక్ష్మమ్మ (49) తన కుటుంబసభ్యులతో కలసి బొలెరో వాహనంలో కదిరిలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వచ్చారు. అక్కడ ఓ శుభ కార్యంలో పాల్గొని సోమవారం అదే వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో గంగసానివారిపల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన భారీ కంటైనర్ ఢీకొంది. బొలెరో వాహనం ముందు భాగం నుజ్జునుజ్జైంది. వెంకటలక్ష్మమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన నరసింహప్ప, నగేష్, అమృత, గంగరత్నమ్మ, నాగరాజు, మునిరత్నమ్మ, మంజులమ్మను స్థానికులు వెంటనే తనకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కదిరిలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు


రాతి దూలం లాగుతున్న వృషభాలు

తాడిమర్రి: మండలంలోని పిన్నదరి సమీపంలో వెలసిన అక్కదేవతల జాతరను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన వృషభాల రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పుల్లానారాయణపల్లి గ్రామానికి చెందిన సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు పొరాళ్ల విజయభాస్కరరెడ్డి నిర్వహించిన ఈ పోటీలకు 13 జతల వృషభాలను రైతులు తీసుకువచ్చారు. పోటీల్లో అనంతపురం జిల్లా తోపుదుర్తి గ్రామానికి చెందిన రైతు చెన్నప్ప వృషభాలు నిర్ణీత 15 నిమిషాల గడువులో 4,750 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే అనంతపురం జిల్లా, గార్లదిన్నెకు చెందిన రైతు పరమేశ్వర వృషభాలు 4,158 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, తోపుదుర్తి గ్రామానికి చెందిన చెన్నప్పకు చెందిన మరో జత వృషభాలు 4,076 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం, బోరంపల్లి గ్రామానికి చెందిన రైతు బాబా ఫకృద్దీన్ వృషభాలు 3,500 అడుగులు, చివరగా తాడిమర్రి మండలం దాడితోట గ్రామానికి చెందిన రైతు నరసింహ వృషభాలు 3,173 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో నిలిచాయి. విజేత వృషభాల యజమానులకు నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు.

ప్రియుడితో ఉడాయించిన నవవధువు

- మనస్తాపంతో భర్త అదృశ్యం


బండ్లపల్లి తిమ్మరాజు (ఫైల్)

రాప్తాడు రూరల్: వివాహమైన మూడు రోజులకే ప్రేమించిన వ్యక్తితో నవ వధువు వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన భర్త ఇంటినుంచి వెళ్లిపోయాడు. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లికి చెందిన బండ్లపల్లి తిమ్మరాజు, ప్రశాంత్‌కుమార్ సోదరులు. వీరికి తండ్రి లేడు. బతుకు తెరువు కోసం తల్లి అంజనమ్మ కువైట్‌కు వెళ్లింది. ఈ క్రమంలో సోదరులిద్దరూ అనంతపురానికి వలస వచ్చి నగర శివారులోని కురుగుంట వైఎస్సార్ కాలనీ నివాసముంటున్నారు. తిమ్మరాజు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుండగా, ప్రశాంత్‌కుమార్ డిగ్రీ పూర్తయి ఇంటివద్దనే ఉంటున్నాడు. గత నెల 9న ఓ యువతితో తిమ్మరాజుకు వివాహమైంది. ఈ పెళ్లి ఇష్టంలేని ఆమె పెళ్లైన మూడో రోజే అంతకు ముందు తాను ప్రేమించిన యువకుడితో వెళ్లిపోయింది. నవ వధువు కనిపించకపోయే సరికి కంగారుపడ్డ తిమ్మరాజు, బంధువులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురైన తిమ్మరాజు ఈ నెల 9న సాయంత్రం 6 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సోదరుడు ప్రశాంత్‌కుమార్ పలుచోట్ల వెతికాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ ప్రవీణ్ తెలిపారు. తిమ్మరాజు ఆచూకీ తెలిసిన వారు 94407 96811 (సీఐ), 93469 17102 (ఎస్‌ఐ) నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

ఆటో బోల్తా .. వ్యక్తి మృతి

కూడేరు: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం ఉదిరిపికొండకు చెందిన లోకేష్ (48), సుశీలమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఆటోలో కూరగాయలు తీసుకెళ్లి విక్రయించడం వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం కొర్రకోడులో కూరగాయలు విక్రయించి తిరుగు ప్రయాణమైన దంపతులు.. ఆ గ్రామ శివారులోకి చేరుకోగానే ఆటో అదుపు తప్పి బోల్తాపడడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి లోకేష్ మృతి చెందాడు. ఘటనపై కూడేరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రూటు మారిన 'యువగళం'

- నిరసనకు సిద్ధమైన దగాపడ్డ 'తమ్ముళ్లు'
- అసమ్మతి సెగకు భయపడిన జేసీపీఆర్?
- తాడిపత్రిని కాదని రాయలచెరువు మీదుగా కర్నూలుకు రూటు మ్యాప్ మార్పు

తాడిపత్రి: అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణం మీదుగా కొనసాగాల్సిన లోకేష్ యువగళం పాదయాత్ర ఆకస్మాత్తుగా రూటు మారింది. టీడీపీ నియోజకవర్గ పెద్దల అసలు రంగు బయటపడకుండా ఉండేందుకే ఈ మార్పు అనివార్యమైనట్లుగా విమర్శలు వెల్లువెత్తాయి.

భారీ సన్నాహాలు చేసి..

శింగనమల నియోజకవర్గం నుంచి పెద్దపప్పూరు మండలంలోకి ప్రవేశించిన లోకేష్ పాదయాత్రకు సంబంధించి ముందుగా నిర్దేశించిన రూట్ మ్యాప్ మేరకు తాడిపత్రిలో బహిరంగ సభ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ మేరకు టీడీపీ మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి భారీగా సన్నాహాలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీని అంటి పెట్టుకుని ఉన్న నాయకులు లోకేష్ ఎదుట అసమ్మతి గళం విప్పేందుకు సిద్ధమయ్యారు. జేసీ సోదరులు టీడీపీలోకి చేరిన తర్వాత చోటు చేసుకున్న పరిణామాలను వివరించేందుకు అందరూ ఏకతాటిపైకి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న జేసీ ప్రభాకరరెడ్డి స్వీయరక్షణలో పడ్డారు. దీంతో వెంటనే రూట్‌మ్యాప్‌ను మార్చి కొత్త మార్గాన్ని ఎంపిక చేశారు. ముందుగా నిర్దేశించిన రూట్ మ్యాప్ మేరకు తాడిపత్రిలో బహిరంగ సభ అనంతరం బుగ్గ, అంకిరెడ్డిపల్లి మీదుగా కర్నూలు జిల్లాలోకి లోకేష్ పాదయాత్ర ప్రవేశించాల్సి ఉంది. అయితే తాజాగా మార్పు చేసిన రూట్ మ్యాప్ మేరకు పెద్దపప్పూరు నుంచి నేరుగా యాడికి మండలం రాయలచెరువు మీదుగా కర్నూలు జిల్లాలోకి ప్రవేశించనుంది.

జేసీ నియంతృత్వ పోకడలపై భగ్గుమంటున్న పాతకాపులు

కాంగ్రెస్ పార్టీలో జేసీ సోదరులున్నంత కాలమూ టీడీపీ నాయకులను, కార్యకర్తలను అన్ని విధాలుగా ఇబ్బంది పెడుతూ వచ్చారు. రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెస్‌ను వీడి తమ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు టీడీపీ తీర్థం పుచ్చుకున్న తర్వాత అప్పటి వరకూ ఆ పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న ఎందరినో తమ నియంతృత్వ పోకడలతో జేసీ సోదరులు అణచి వేస్తూ వచ్చారు. విపత్కర పరిస్థితుల్లో పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచి జేసీ సోదరుల దౌర్జన్యాలను ప్రాణాలకు తెగించి ఎదుర్కొన్న పేరం నాగిరెడ్డి, వేలూరు శ్రీనివాసులు, ఫయాజ్ బాషా, జిలానీ బాషా తదితరులు పూర్తిగా కనుమరుగయ్యారు. కొందరు జేసీ సోదరుల దౌర్జన్యాలకు భయపడి వారి పంచన చేరగా...ఇంకొందరు మరో పార్టీలోకి వలస వెళ్లారు. మరి కొందరు రాజకీయాలను వీడి తటస్థంగా ఉండిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో జేసీ అక్రమాలు నేరుగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ దృష్టికి తీసుకెళ్లేందుకు తాడిపత్రి బహిరంగ సభను వేదికగా మార్చుకోవాలని పలువురు భావించారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి తీరుతో పార్టీ ఎంతలా నష్టపోతుందో క్షేత్రస్థాయిలో ఆధారాలతో సహా నిరూపించేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని పసిగట్టిన జేసీ ప్రభాకర్‌రెడ్డి వెంటనే తాడిపత్రి మీదుగా పాదయాత్రను రద్దు చేయించి, దారి మళ్లించేలా పావులు కదిపారు. జేసీ ప్రభాకరరెడ్డి మాయలో చిక్కుకున్న లోకేష్ సైతం పార్టీ పాత కాపులను కాదని ముందుకు సాగేందుకు సిద్ధమయ్యారు. ఇది కాస్త విమర్శలకు తావిస్తోంది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

EAMCET - NEET - JEE

■ **150 seats in 2022.** హాస్టల్ వసతి కలదు. శారద అకాడమి, 2nd Cross, అశోక్‌నగర్, అనంతపురము. సెల్ : 9866117303, 6281158454. [A-7676]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-486]

EDUCATION

■ **Hotel Management Courses at** Mariya Nagar on. NH44. Cheenakothapalli mandalam offered by Guinness World Record Holder Ph : 9398164950. [H-781554]

REAL ESTATE

బాడుగకు ఇవ్వబడును

■ షోరూమ్, ఓపెన్ హాల్ మరియు సెల్లార్, స్టడీ హాల్, ఫర్నీచర్ షాప్ & రెస్టారెంట్స్ కొరకు సుభాష్ రోడ్డు రిలయన్స్ ట్రెండ్స్ ఎదురుగా సందులో బాడుగకు ఇవ్వబడును. సెల్: 8500078407, 9440288427. [A-664]

HOUSE FOR SALE

■ ATP లోని రాంనగర్ 80 ఫీట్ రోడ్డు అయ్యప్ప స్వామి టెంపుల్ దగ్గర అన్ని వసతులు కల్గిన Duplex, Individual, డబుల్, త్రిపుల్ బెడ్ రూమ్ ఇళ్ళు లోన్ సదుపాయంతో అమ్మకంనకు కలవు. సెల్ : 9441104913, 9866011539. [A-2436]

SERVICES

■ అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ✆ 9115551443. [T-04]

WANTED

■ **JOBS :** కొరియర్ డెలివరీ బాయ్స్ మరియు సేల్స్‌మెన్స్ కావలెను. కొరియర్ డెలివరీ లోకేషన్ @ అనంతపురం టౌన్. Contact: 8921589244. [A-663]

■ **VL Manufacturers** నందు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఆటోడ్రైవర్స్, కావలెను. జీతం: 12,000–19000/–. సంప్ర॥ 6309241148, 6302892553 [G-6674]

■ **Hydలో** ప్రముఖ ఇ-కామర్స్, ఫార్మా, MNC కంపెనీలకై హెల్పర్స్, ప్యాకర్స్, సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, కేటరింగ్ బాయ్స్ కావలెను. రూం, భోజనం ఫ్రీ. జీ. 15,000–30,000. ఫోన్.9121989824 [HA-10717]

■ అనంతపురం జిల్లా గార్లదిన్నెలో ఉన్న ఎడ్యుకేషనల్ సర్వీస్ Office లో టెలికాలర్స్‌గా Work చేయడానికి Females కావలెను. సంప్ర॥ సెల్: 8977502169. [A-2394]

■ టెలికాలర్స్ జాబ్స్ : ATP లో, మా ఆఫీస్ నందు వర్క్ చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Age: 35 సం॥లోపు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు సంప్ర॥ సెల్: 9160429288, 7997757059. [A-734373]

■ **JOBS :** హ్యాపీ న్యూ హోమ్స్ రియల్ ఎస్టేట్ కంపెనీ నందు సేల్స్ మేనేజర్స్ కావలెను. Salary 25000/-. Contact: 9440244057, 8008135467, ATP. [A-670]

■ మీ ఇంటిదగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15000 నుంచి 20,000 వరకు జీతం.మరిన్ని వివరాలకై 9000408325 [G-785729]

■ **JOB VACANCY.** Age 18 to 30, 10th to Any Degree, Office job 18,000 to 25,000, Work from home 15,000 to 18,000, ✆ 9080785775. [T-1244]

■ ప్రముఖ బ్యాంకు అనుబంధ సంస్థకు కలెక్షన్ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. వెంటనే సంప్రదించండి Debt Care Enterprises Ltd. ✆ 83176 61277, 98482 25678 [B-48]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785720]

■ సరస్వతి ఎంటర్‌ప్రైజెస్ చదువుకొని నిరుద్యోగులుగా ఉన్నా యువతి/ యువకులు కావలెను. ఓల్డ్ రికార్డ్స్ డేటా ఎంట్రీ చేస్తూ 3500 వరకు సంపాదించుకోవచ్చు. సంప్ర: 8885327824. [C-784760]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

అద్దెకు | అమ్మకం | రియల్ ఎస్టేట్ | ఫర్నీచర్స్ | ఆటోమొబైల్ | కంప్యూటర్స్ | సర్వీసెస్ | కావలెను

4 లైన్లు రూ॥ 270/-

అదనపు లైను రూ॥ 60/-

ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307, 9010588846, 9243295650
DHARMAVARAM : 9912220726, 9912220727
HINDUPUR : 9912220723, 9705346587
GUNTAKAL : 9010223701
TADIPATRI : 9912220722
MADAKASIRA : 9010200238
KADIRI : 9010593486
RAYADURG : 9010470185

■ **Wanted PRO'S to work in** Reputed International School in Anantapur. Cont: 9100314499, 9440354441. [A-734371]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉండి, పార్ట్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ ప్రతి రోజూ రూ. 500 నుండి రూ. 600 వరకు సంపాదించే అవకాశం. డైలీ పేమెంట్స్. సంప్ర: 9985782069. [A-734375]

■ **WANTED LECTURERS All** Subjects, PRO's, Wardens, Tutors, Tele Callers. Contact 9866117303, 6281158454. [A-7979]

■ ఆడిటర్ వద్ద పనిచేయుటకు కావలెను. Tally + కంప్యూటర్ నాలెడ్జ్ గల B.Com. వారికి ప్రాధాన్యత. బయోడేటాతో 11/4/2023 @ 10 AM to 6 PM సంప్ర॥ D.No. 12-5-346, రామ్ నరేష్ ఫంక్షన్ హాల్ ప్రక్కన, హౌసింగ్ బోర్డ్ కాలనీ రోడ్, ATP. 9533764777. [A-734374]

■ **Experienced Part Time / Full Time** lecturers for all subjects, J.L., Tele Callers, Marketing PRO's, Receptionist, Drivers. PRK Junior College, ATP. Cell: 9440045441, 8341729797. [A-7667]

■ క్రొత్తగా ప్రారంభించిన మా కంపెనీలో 28 మంది స్త్రీ/పులకు ఉద్యోగాలు. జీతం: 13,000 + బోనస్ 6,000, రూమ్, ఫుడ్ ఫ్రీ. అర్హత : SSC to డిగ్రీ (పా/ఫె). సాయినగర్ 1వ క్రాస్, అనంతపురం. సెల్: 9701864175. [A-7673]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.